నేను మళ్లీ ఎమ్మెల్యేనైతే..



ప్రగతి పథంలో నడిపిస్తా

తుని: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరఫున విజయం సాధిస్తే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేస్తాను. తుని నుంచి ఇప్పటికే రెండు సార్లు గెలిపించిన ప్రజలు మూడోసారి విజయం అందిస్తారని ఆశిస్తున్నాను. నేను ఎమ్మెల్యేగా గెలిస్తే తుని నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతాను. తాండవ నది వరదకు పట్టణం ముంపు బారిన పడకుండా కుమ్మరిలోవ నుంచి ఇసకలపేట వరకూ కరకట్ట నిర్మిస్తాను. ఏలేరు- తాండవ ప్రాజెక్టు అనుసంధానం చేసి కోటనందూరు, తుని మండలాల్లో వేలాది ఎకరాల భూమికి సాగు నీరు, తాగునీరు అందిస్తాను. కోన ప్రాంతంలో పరిశ్రమలను తీసుకువచ్చి యువత ఉద్యోగ, ఉపాధిని కల్పిస్తాను. తుని పట్టణంలో మెయిన్ రోడ్డు విస్తరణ చేపడతాను. తునిలో మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తాను.

– దాడిశెట్టి రాజా, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, తుని



అన్నివిధాలా అభివృద్ధి చేస్తా

గోకవరం: తనకు ఎమ్మెల్యేగా మరోసారి అవకాశం ఇస్తే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో జగ్గంపేట నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తానని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం తెలిపారు. తాను రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా సేవలందించానని, అలాగే ఒకసారి ఎంపీగా పని చేశానన్నారు. ఈ అనుభవంతో నియోజకవర్గంలో సాగునీరు, తాగునీటి వసతుల కల్పనతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి కృషి చేస్తానన్నారు. గోకవరం మండలంలో పలు ప్రభుత్వ భూములు కబ్జాకు గురయ్యాయని, వీటిని కబ్జాకోరల నుంచి విడిపించి పరిరక్షిస్తానన్నారు. అలాగే అర్హులందరికీ ఇళ్ల స్థలాలు అందించేందుకు పాటుపడతానన్నారు. నియోజకవర్గ ప్రజలకు అన్నివేళలా అందుబాటులో ఉండి ప్రజా సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు.

– తోట నరసింహం, ఎమ్మెల్యే అభ్యర్థి, వైఎస్సార్ సీపీ, జగ్గంపేట




నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా

ఏలేశ్వరం: నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తాను. గతంలో రెండుసార్లు ఎమ్మెల్యేగా పనిచేయడంతో నియోజకవర్గ సమస్యలపై నాకు అవగాహన ఉంది. ప్రభుత్వం అమలుచేసే ప్రతి పథకాన్ని అర్హులకు అందేలా చూస్తాను. రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటాను. ఏటా పంటల సీజన్‌లో ఏలేరు నుంచి సాగునీరు విడుదల చేయించడం నాకు ఆలవాటే. నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాను.

– వరుపుల సుబ్బారావు, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, ప్రత్తిపాడు నియోజకవర్గం

క్లుప్తంగా

ఘనంగా రూపులమ్మ తీర్థం



రూపులమ్మ అమ్మవారు

ఏలేశ్వరం: గ్రామ దేవత రూపులమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవం శుక్రవారం పట్టణంలో ఘనంగా జరిగింది. స్థానిక మార్కెట్‌వీధిలో వేంచేసిన అమ్మవారి ఆలయానికి తెల్లవారుజాము నుంచే భక్తులు పోటెత్తారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల దర్శనార్థం వారంరోజుల పాటు అమ్మవారి ఆలయాన్ని తెరిచే ఉంచుతారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. చుట్టుప్రక్కల గ్రామాలతో పాటు పట్టణంలోని పలుప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద పలు దుకాణాలు ఏర్పాటు చేశారు. గురువారం రాత్రి అమ్మవారి జాతర నిర్వహించారు. జాతరలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం



వనదుర్గ అమ్మవారికి చండీహోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీహోమం నిర్వహించారు. ఉదయం 9 గంటలకు పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమ ద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. సత్యదేవుని ప్రధానాలయంలో అనంతలక్ష్మీసత్యవతీదేవి అమ్మవారికి ఆలయ ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో రుత్విక్కులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొండ దిగువన కనకదుర్గ అమ్మవారికి రుత్విక్కులు కుంకుమార్చన నిర్వహించారు.

'నాడు-నేడు' పనులు త్వరితగతిన పూర్తి చేయాలి



తొండంగి ఎంఈవో కార్యాలయంలో అధికారులతో సమీక్షిస్తున్న డీఈఓ రమేష్

తొండంగి: ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన రెండో విడత నాడు-నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డీఈఓ రమేష్ అధికారులను ఆదేశించారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో శుక్రవారం విద్యాశాఖ అధికారులు, సిబ్బందితో ఆయన సమీక్షించారు. పలు రికార్డులతో పాటు నాడు-నేడు పనులకు సంబంధించి ప్రగతి నివేదికను పరిశీలించారు. పలు చోట్ల పనులు పూర్తికాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రూ.1.20 కోట్లు నిధులు ఉన్నప్పటికీ పనులు పూర్తికాకపోవడంపై అధికారులను ఆరా తీశారు. వేసవి సెలవులు పూర్తయ్యేలోపు పనులను యుద్ధప్రాతిపదికన నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే విద్యార్థులకు సమ్మర్ క్యాంపులు నిర్వహించాలన్నారు. పదో తరగతిలో ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. ఎన్నికల పోలింగ్ కేంద్రాలుగా ఎంపిక చేసిన పాఠశాలల్లో నాడు-నేడు పనుల మెటీరియల్ ఓటర్లకు అడ్డులేకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో షేక్‌బాబ్జి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వర్షంతో చల్లబడిన వాతావరణం

తొండంగి: మండల వ్యాప్తంగా శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షానికి వాతావరణం చల్లబడింది. రెండు రోజులుగా ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఉక్కపోతకు గురయ్యారు. కాగా శుక్రవారం సాయంత్రం ఆకాశం మేఘావృతమై వాతావరణం చల్లబడింది. బెండపూడి, గోపాలపట్నం, ఎ.కొత్తపల్లి, రావికంపాడు తదితర ప్రాంతాల్లో మోస్తారుగా వర్షం కురిసింది. దీంతో ప్రజలు ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందారు.

ఫ్యాన్‌టాస్టిక్ విజయం వైపు పయనం

- ప్రచారంలో వైఎస్సార్ సీపీ ముందంజ
- ప్రత్తిపాడు నియోజకవర్గంలో వీస్తున్న ఫ్యాన్ గాలి
- అడుగడుగునా వరుపుల సుబ్బారావుకు ప్రజలు నీరాజనం



ఎన్నికల ప్రచారం చేస్తున్న వరుపుల సుబ్బారావు

ఏలేశ్వరం: సార్వత్రిక ఎన్నికలకు సమయం దగ్గర పడింది. మరో మూడు రోజుల్లో పోలింగ్ జరగనున్న నేపథ్యంలో మెట్టప్రాంతమైన ప్రత్తిపాడు నియోజకవర్గంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. ప్రత్తిపాడులో ప్రధాన పోటీ వైఎస్సార్ సీపీ, టీడీపీ మధ్యే ఉంది. వైఎస్సార్ సీపీ నుంచి వరుపుల సుబ్బారావు, టీడీపీ నుంచి వరుపుల సత్యప్రభ పోటీ చేస్తున్నారు.

ప్రచారంలో ముందంజ

ప్రత్తిపాడు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ ప్రచారంలో దూసుకుపోతోంది. ప్రతి గ్రామంలోనూ ఫ్యాన్ గాలి వీస్తోంది. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావుకు అడుగడుగునా ప్రజలు నీరాజనం పడుతున్నారు. గత ఐదేళ్లలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను ప్రజల ఇంటికే చేర్చడంతో పాటు అన్నివర్గాల అభ్యున్నతికి కృషి చేయడంతో ప్రజలు మరోసారి వైఎస్సార్ సీపీ వైపే మొగ్గుచూపుతున్నారు. తమ అమూల్యమైన ఓటును ఫ్యాన్‌గుర్తుపై వేసి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుంటామని ప్రజలు ముక్తకంఠంతో చెబుతున్నారు.

హ్యాట్రిక్ దిశగా..

ఒకే దెబ్బకు రెండుపిట్టలు అన్నట్టుగా ఉంది ప్రత్తిపాడు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు పరిస్థితి. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ ముచ్చటగా మూడోసారి విజయం సాధించి హ్యాట్రిక్ దిశగా పయనిస్తోంది. అలాగే ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు మూడోసారి విజయం సాధించేందుకు సిద్ధమయ్యారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో 2014, 2019 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధించగా 2004, 2014లో వరుపుల ఎమ్మెల్యేగా గెలిచారు. మొదటసారి దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి, రెండోసారి సీఎం జగన్ హయాంలో ఎమ్మెల్యేగా నెగ్గారు. గత ఐదేళ్లలో నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేనంత అభివృద్ధి జరిగింది. నాడు-నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులను అభివృద్ధి చేశారు. ఇంటింటికీ పింఛన్లు, రేషన్ పంపిణీపై అన్నివర్గాల ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

వరుపులకు కలిసిరానున్న అనుభవం

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావుకు సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉండటం ఈ ఎన్నికల్లో ఆయనకు కలిసి వస్తోంది. నియోజకవర్గంలో ఎవరినైనా పేరు పెట్టి పిలవడం వరుపుల సొంతం. దీంతో పాటు రెండుసార్లు ఎమ్మెల్యేగా పనిచేయడంతో వరుపులకు నాలుగు మండలాల్లోని ప్రతిఒక్కరితోనూ మంచి సంబంధాలు ఉన్నాయి. ఏలేశ్వరం, ప్రత్తిపాడు మండలాలతో పాటు శంఖవరం, రౌతులపూడి మండలాల్లో మంచిపట్టు ఉంది. దీనికి తోడు వరుపుల కుటుంబసభ్యులందరూ ప్రచారం చేస్తున్నారు. భార్య, కుమారులు, కుమార్తె, కోడళ్ల ప్రచారంలో దూసుకుపోతున్నారు. దీనికి తోడు ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ అన్నితానై నడిపిస్తుండడంతో వరుపుల గెలుపు ముంగిటలో ఉన్నారు.

4 నంబర్‌తో లక్కు కలిసొచ్చేనా

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావుకు నాలుగు నంబర్‌తో ప్రత్యేకత ఉంది. ఆయన మొదటిసారిగా 1994లో డీసీసీబీ చైర్మన్‌గా నెగ్గారు. అలాగే 2004, 2014లో ఎమ్మెల్యేగా గెలిచారు. ప్రస్తుతం 2024లో పోటీచేయడంతో పాటు బ్యాలెట్‌లో 4 నంబర్ రావడం విశేషం. దీంతో వరుపుల గెలుపు నల్లేరుపై నడకేనని పార్టీవర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

జగనన్నతోనే పేదలకు బంగారు భవిష్యత్



కిర్లంపూడి ఏనుగువీధిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ముద్రగడ గిరిబాబు

కిర్లంపూడి: పేదలకు బంగారు భవిష్యత్ జగనన్నతోనే సాధ్యమని కాపు ఉద్యమ నేత, వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం తనయుడు గిరిబాబు అన్నారు. కిర్లంపూడిలో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఆయనకు అడుగడుగునా గ్రామస్తులు అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసి దేశంలోనే ఆదర్శవంతమైన పాలన అందించారన్నారు. విద్య వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం జరిగే ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేసి కాకినాడ ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను, జగ్గంపేట ఎమ్మెల్యేగా తోట నరసింహాన్ని గెలిపించాలని కోరారు. తొలుత పెంట కోట నాగబాబు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు మోటర్ సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు.

సంక్షేమాన్ని చూసి ఓటేయండి



మల్లిసాలలో ఎన్నికల ప్రచారం చేస్తున్న తోట నరసింహం

- వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం
- పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం



తిరుమలాయపాలెంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న తోట నరసింహం

గోకవరం: గత ఐదేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని చూసి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి మరోసారి జగన్‌ను ముఖ్యమంత్రిని చేయాలని వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం అన్నారు. మండలంలోని తిరుమలాయపాలెంలో శనివారం ఆయన రోడ్డు షో ద్వారా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల పాటు విశ్వసనీయతకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన వైఎస్సార్ సీపీకి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పట్టం కట్టాలన్నారు. అన్ని వర్గాల వారికి పథకాలు అందించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై విశ్వాసం ఉంచి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా, చలమలశెట్టి సునీల్‌ను ఎంపీగా గెలిపించాలని కోరారు. పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే పథకాల కొనసాగింపు

జగ్గంపేట: రాష్ట్రంలో ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం అన్నారు. మండలంలోని మల్లిసాల, వెంగాయ్యమ్మపురం, రాజపూడి, జె.కొత్తూరు తదితర గ్రామాల్లో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు మోటారు సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. మహిళలు ఆయనకు హారతులు పట్టారు. తీన్‌మార్ డ్యాన్సులతో యువత సందడి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెట్ట ప్రాంతమైన జగ్గంపేట నియోజకవర్గం నేడు సస్యశ్యామలమై రెండు పంటలు పండుతున్నాయంటే నాడు వైఎస్ రాజశేఖరరెడ్డి మంజూరు చేసిన పుష్కర ఎత్తిపోతల పథకమే కారణమన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి అన్నారు.గత ఐదేళ్లలో అన్ని వర్గాలకూ సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఫ్యాన్‌గుర్తుపై ఓటు వేసి జగ్గంపేట ఎమ్మెల్యేగా తనను, కాకినాడ ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ అత్తులూరి నాగబాబు, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ జాన్ వెస్లీ, నియోజకవర్గ ఎన్నికల సమన్వయకర్త అత్తులూరి సాయిబాబు, పార్టీ నేతలు పాలిపిరెడ్డి సత్తిబాబు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ని కుట్రలు చేసినా విజయం మాదే



బాపన్నధారలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వరుపుల సుబ్బారావు

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు
- పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం

ప్రత్తిపాడు రూరల్: ప్రజల గుండెల్లో గుడికట్టుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఓడించేందుకు ప్రతి పక్షాలన్నీ ఏకమై కుటిల రాజకీయాలు చేస్తున్నాయని, ఎన్ని కుట్రలు చేసినా ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయాన్ని ఆపలేరని ఆ పార్టీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు అన్నారు. మండలంలోని బురదకోట, కె.మిర్తివాడ, కొండపల్లి, బాపన్నదార గిరిజన గ్రామాల్లో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి గత ఐదేళ్లలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకూ వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా వరుపుల సుబ్బారావు మాట్లాడుతూ ఇటీవల సీఎం జగన్ విడుదల చేసిన మేనిఫెస్టోను ప్రజలు స్వాగతిస్తున్నారన్నారు. ప్రజలకు ఏమి చేయగలమో.. ఎంత మంచి చేయొచ్చో అదే మేనిఫెస్టోలో చెప్పారన్నారు. నవరత్న పథకాలను మరింత విస్తృతపరిచి మేనిఫెస్టోలో పొందుపరిచారన్నారు. చంద్రబాబు అమలుకాని బూటకపు హామీలతో ప్రజలను మరోసారి మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ప్రజలు టీడీపీ మేనిఫెస్టోను నమ్మే పరిస్థితి లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఫ్యాన్‌గుర్తుపై ఓటువేసి ప్రత్తిపాడు ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు చింతల రాజు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ సారథికి మళ్లీ పట్టం కట్టండి

- మంత్రి, వైఎస్సార్ సీపీ తుని ఎమ్మెల్యే అభ్యర్థి దాడిశెట్టి రాజా
- బెండపూడిలో ఎన్నికల ప్రచారం



బెండపూడిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

తొండంగి: కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మళ్లీ పట్టం కట్టాలని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ తుని ఎమ్మెల్యే అభ్యర్థి దాడిశెట్టి రాజా పిలుపునిచ్చారు. మండలంలోని బెండపూడిలో శుక్రవారం మంత్రి రాజా, ఆయన తనయుడు శంకర్‌మల్లిక్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. తొలుత ఎస్సీపేటలో బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తూర్పుకాపుల వీధి, కృష్ణాలయం వీధి, ఎస్సీపేట, ఎస్సీకాలనీ, పాత ఊరు తదితర ప్రాంతాల మీదుగా వర్షాన్ని సైతం లెక్క చేయకుండా ఎన్నికల ప్రచారం జోరుగా సాగింది. ఈ సందర్భంగా మంత్రి రాజా మాట్లాడుతూ చంద్రబాబు 2014 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేశారన్నారు. సీఎం వైఎస్ జగన్ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేయడంతో పాటు గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా సంక్షేమ పథకాలను ప్రజల ఇంటి ముంగిటకే అందించారన్నారు. రాష్ట్రంలో పేదలకు 32 లక్షల ఇళ్లు నిర్మిస్తున్నారన్నారు. పాలనా వ్యవస్థలో మార్పులు తీసుకొచ్చి ప్రతి కుటుంబానికి సంక్షేమ లబ్ధిని అందించారన్నారు. సోమవారం జరిగే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి తుని ఎమ్మెల్యేగా తనను, కాకినాడ ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మద్దుకూరి వీరవెంకట సత్యనారాయణచౌదరి(పెద్దబ్బు), మద్దుకూరి వెంకటరామయ్యచౌదరి(చిన్నబ్బు), మద్దుకూరి గోపి, ఆరుమిల్లి ఏసుబాబు చౌదరి, ఏలేటి ధర్మరాజు, సర్పంచ్ ఏలేటి దుర్గాదేవి, ఎంపీటీసీలు గొంతెన నాగేశ్వరరావు, మళ్ల సురేష్, బూసాల గణపతి, సోమిశెట్టి చలపతి, బూసాల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

హోరెత్తిన ప్రచారం



ఎస్.అన్నవరం శివారులో ఇంటింటా ప్రచారం చేస్తున్న మంత్రి రాజా సతీమణి లక్ష్మీచైతన్య

తుని రూరల్: వచ్చే ఎన్నికల్లో తుని ఎమ్మెల్యేగా దాడిశెట్టి రాజాను, కాకినాడ ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను గెలిపించాలని కోరుతూ మంత్రి రాజా సతీమణి దాడిశెట్టి లక్ష్మీచైతన్య ఇంటింటా ప్రచారం నిర్వహించారు. శుక్రవారం తుని మండలం ఎస్.అన్నవరం శివారు కొబ్బరితోట వీధి, కవలపాడు గ్రామంలో తుని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణితో కలసి ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనే మహిళలకు సముచిత స్థానం లభించిందన్నారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు కుసనం పూర్ణిమశాంతి, వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు, నాయకులు కుసనం దొరబాబు, వంగలపూడి కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం



వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేస్తున్న పంచాయతీ కార్మికులు

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని కత్తిపూడి సర్పంచ్ కొల్లు సత్తిబాబు అన్నారు. మండలంలోని కత్తిపూడిలో శుక్రవారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సత్తిబాబు మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

- వైఎస్సార్ సీపీ కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్
- కోటనందూరులో ఎన్నికల ప్రచారం



కోటనందూరులో ఎన్నికల ప్రచారం చేస్తున్న చలమలశెట్టి సునీల్, శంకర్‌మల్లిక్

కోటనందూరు: అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పని చేసి రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని వైఎస్సార్ సీపీ కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ విజ్ఞప్తి చేశారు. కోటనందూరులో శుక్రవారం సాయంత్రం మంత్రి దాడిశెట్టి రాజా తనయుడు శంకర్‌మల్లిక్‌తో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారం రథంపై నుంచి ప్రజలకు అభివాదం చేస్తూ ఫ్యాన్ గుర్తుపై ఓటేసి కాకినాడ ఎంపీగా తనను, తుని ఎమ్మెల్యే దాడిశెట్టి రాజాను గెలిపించాలని కోరారు. అధికారంలోకి వచ్చాక ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ లగుడు శ్రీనివాసు, తుని ఏఎంసీ వైస్ చైర్మన్ వెలగా వెంకట కృష్ణాజీ, లోవదేవస్థానం మాజీ చైర్మన్ లాలం బాబ్జీ, వైఎస్సార్ సీపీ నాయకులు గరిసింగు దొరబాబు, కొరుప్రోలు కృష్ణ, మల్లంపల్లి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయం కోరుతూ మహిళల ర్యాలీ



తునిలో ర్యాలీ చేస్తున్న మహిళలు

తుని: సార్వత్రిక ఎన్నికల్లో తుని అసెంబ్లీ, కాకినాడ ఎంపీ అభ్యర్థులు దాడిశెట్టి రాజా, చలమలశెట్టి సునీల్ విజయం సాధించాలని కోరుతూ తునిలో శుక్రవారం సాయంత్రం మహిళలు భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక బాలాజీ సెంటర్ నుంచి చేపట్టిన ర్యాలీని తుని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి ప్రారంభించారు. పట్టణానికి చెందిన మహిళా కౌన్సిలర్లు, మండలాలకు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అక్కచెల్లెమ్మల ఓట్లు జగన్‌మోహన్‌రెడ్డికే అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. మున్సిపల్ కార్యాలయం, జీఎస్‌టీ రోడ్డు మీదుగా గొల్ల అప్పారావు సెంటర్‌కు చేరుకున్నారు. అక్కడ నుంచి జీఎస్‌టీ రోడ్డు మీదుగా ర్యాలీ కొనసాగించారు.ర్యాలీ ప్రారంభమైన కొద్ది సేపటికే వర్షం కురిసినా మహిళలు మొక్కవోని దీక్షతో జై జగన్, జై రాజా నినాదాలతో ర్యాలీ చేశారు. పార్టీ తుని నియోజకవర్గ పరిశీలకుడు ఒమ్మి రఘురాం, జగ్గంపేట జెడ్పీటీసీ బిందుమాధవి, తుని మున్సిపల్ కౌన్సిలర్లు, మహిళా కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.